క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు ఆయురోగ్యాలతో, పాడిపంటలతో కళకళలాడాలని స్వామికి మొక్కుకున్నట్లు తెలిపారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప ఎమ్మెల్యేకు స్వాగతం పలికి స్వామి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు

వాల్మీకిపురం: శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ ఆలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రం సందర్భంగా వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో అర్చకుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అభిరామ్‌స్వామి, రాజుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిర వార్షిక వేడుక




ప్రత్యేక అలంకరణలో సత్యసాయి చిత్రపటం

బి.కొత్తకోట: స్థానిక సత్యసాయి బాబ మందిర మూడో వార్షికోత్సవ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. మందిరంలో సత్యసాయి చిత్రపటానికి పూలతో ప్రత్యేక అలంకరణలు చేసి, భజనలు చేశారు. ఓంకారం, సుప్రభాతం, నగర కీర్తలతో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

మదనపల్లె సిటీ: ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మాధవ్ కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవనంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. వచ్చే నెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగంలో మహాసభలు జరుగుతాయని తెలిపారు. సభల్లో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినోద్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శం



వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం: వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వాల్మీకి సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని టి.సదుంలో వాల్మీకులంతా మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతిలో వాల్మీకి స్థానం ప్రత్యేకమైందని, సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని లిఖించిన మహోన్నతమైన వ్యక్తి అని వాల్మీకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నివాళి



అన్నదానం నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి

మదనపల్లె : మదనపల్లె, చౌడేపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన రంగనాథ గుప్తా ఈ నెల 10వ తేదీన బెంగళూరులోని కెంగేరీలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన శిష్యుడు, కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్, శ్రీనివాస డిగ్రీ కాలేజ్ చైర్మన్ కృష్ణారెడ్డి, రంగనాథగుప్తా దశమదిన కర్మ సందర్భంగా పట్టణంలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో చిన్నారులకు అన్నదానం చేశారు. చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ సెక్రటరీ కవితారాణి, పట్నం గిరిజమ్మాళ్ పాల్గొన్నారు.

కలల గూడు.. చెదిరెను చూడు..!

వాళ్లంతా కాయకష్టం చేసి రూపాయికి రూపాయి కూడ బెట్టుకొని స్థలం కొనుగోలు చేసి గూడు నిర్మించుకున్నారు. మూడేళ్లుగా ప్రశాంతంగా జీవించారు. ఆదివారం వారు పిడుగులాంటి వార్త విన్నారు. వీళ్లు నివసిస్తున్న స్థలం ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో వారి కలల గూడు చెదిరిపోయింది. ఓ నాయకుడిని నమ్మి మోసపోయామని బాధితులంతా లబోదిబోమంటున్నారు.



అంగళ్లు గ్రామం 118 సర్వేలో అధికారులు, బాధితులు

- 118లో హెచ్చరిక బోర్డు
- నిండా మునిగిన పేదలు
- ఆలస్యంగా మేలుకొన్న రెవెన్యూ శాఖ
- దిక్కుతోచని స్థితిలో బాధితులు

కురబలకోట: కురబలకోట మండలం అంగళ్లు గ్రామం విశ్వం కళాశాల సమీపంలో హైవే పక్కన ఉన్న సర్వే నంబరు 118లో రెవెన్యూ అధికారులు ఆదివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ మూడేళ్లుగా 28 సెంట్లు స్థలంలో ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్న 12 మంది పేదలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ స్థలం జాతీయ రహదారికి పక్కనే ఉండండంతో మార్కెట్‌లో డిమాండ్ కూడా పెరిగింది. మూడేళ్ల క్రితం ఓ నాయకుడు 12 మందికి రెండు సెంట్లు చొప్పున విక్రయించాడు. రెండు సెంట్ల పట్టా స్థలం రూ. మూడన్నర లక్షలతో కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఒక్కో పట్టా రూ.15 లక్షలు పలుకుతోంది. సదరు నాయకుడు వీరికి పట్టాలు కూడా ఇప్పించాడు. దీంతో ఇళ్లను నిర్మించుకున్నారు. సదరు భూమి రస్తా పొరంబోకు స్థలంగా రెవెన్యూ రికార్డులలో ఉందని, ఇక్కడ ఇళ్లు నిర్మించుకోవడం అక్రమమని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఈ స్థలంలో ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో ఇన్నేళ్ల పేదల ఆశలు ఒక్కసారిగా కుప్పకూలాయి. తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.



ప్రభుత్వ భూమిలో ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

నమ్మించి ముంచేశాడు



ఓ నాయకుడు చెప్పడంతో అగ్రిమెంటు ద్వారా రూ. 6 లక్షలకు మూడేళ్ల క్రితం రెండు సెంట్లు కొన్నా. కాయ కష్టం చేసి స్థలం కొనుగోలు చేశాం. స్థలానికి పట్టా కూడా ఇచ్చారు. తీరా చూస్తే ముంచేశారు. ఇప్పుడు దిక్కుతోచడం లేదు. మాకు న్యాయం చేయాలి.

–టి. రమణ, బాధితుడు, తుంగావారిపల్లె, కురబలకోట మండలం

రస్తా పొరంబోకు భూమి



అంగళ్లు గ్రామంలోని విశ్వం కళాశాల సమీపంలో ఉన్న సర్వే నంబరు 118లో ఉన్న భూమి రస్తా పొరంబోకు స్థలంగా రికార్డుల్లో ఉంది. పట్టాలు ఎవరికీ ఇవ్వలేదు. 12 అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశాం. ఇందులో ప్రవేశిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు.

–తపస్విని, తహసీల్దారు, కురబలకోట మండలం

ఆ పట్టాలు నేను ఇవ్వలేదు



118 రస్తా పొరంబోకు స్థలంలో తాను ఉన్నప్పుడు ఎవ్వరికీ పట్టాలు ఇవ్వలేదు. అవి ఫేక్ పట్టాలు. వాటిపై ఉన్న సంతకాలు నావి కాదు. నకిలీ పట్టాలు సృష్టించి ఇచ్చారు. అవి రెవెన్యూ రికార్డులలో కూడా నమోదు కాలేదు. నాకు ఎలాంటి సంబంధం లేదు.

–భీమేశ్వరరావు, తహసీల్దారు

మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే షాజహాన్ బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

నిమ్మనపల్లె : నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. ఆదివారం మండలంలోని 12 సచివాలయాల పరిధిలో 20 గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమానికి హాజరై సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం రాచవేటివారి పల్లె పంచాయతీలోని ఎగువ మాచిరెడ్డిగారి పల్లెలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలను ఏర్పాటు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మండల పరిధిలో ఉపాధి హామీ నిధులతో సుమారు రూ.1.70 కోట్లతో 3,750 మీటర్ల పొడవైన సిమెంటు రోడ్డు పనులను చేపడుతున్నమన్నారు. కాలువల నిర్మాణానికి రూ. కోటి రూపాయలు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. రెండో విడతలో సిమెంట్ రోడ్డు నిర్మాణాలకు మరో రూ. 2 కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు గ్రామాల్లో ప్రతి ఒక్కరూ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. త్వరలో మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. రాచవేటివారిపల్లెలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం అలియాస్ మధు, ఆర్. వరలక్ష్మి, ఉషారాణి, జి శ్రీవాణి, చెంద్రాయుడు, మహాదేవరెడ్డి, తహసీల్దార్ ధనుంజయులు, ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు పల్లె పండుగ

మదనపల్లె : ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం 7.30 గంటలకు సీటీఎం కస్బాలో కార్యక్రమం ప్రారంభమై సీటీఎం క్రాస్ రోడ్, దుబ్బిగానిపల్లె, కొత్తవారిపల్లె, పోతపోలు, కొండామర్రిపల్లె, బసినికొండ, వలసపల్లె, కొత్తపల్లె, మాలేపాడు, పెంచుపాడు, కోటవారిపల్లె, వేంపల్లె, చీకలబైలు, అంకిశెట్టిపల్లె, పాన్నేటిపాళెం, కురవంక, కోళ్లబైలు పంచాయతీల్లో సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

లోతు వంక ఆక్రమణలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కురబలకోట: మండలంలోని లోతువంక (కొత్త చెరువు)లో ఆక్రమణలను తొలగించినట్లు తహసీల్దారు తపస్విని తెలిపారు. కబ్జా కోరల్లో లోతు వంక చెరువు అనే వార్త సాక్షిలో ఇటీవల ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు ఎకరాల దాకా ఉన్న ఆక్రమణలు తొలగించినట్లు ఆమె తెలిపారు. ఆర్ఐ బాల సుబ్రమణ్యం, వీఆర్వో సురేంద్రరెడ్డి, స్థానిక సర్వేయర్ లక్ష్మి ప్రియ తదితరులు పాల్గొన్నారు.



లోతువంకలో ఆక్రమణలు తొలగిస్తున్న ఆర్ఐ, సర్వేయర్

కార్యకర్తలు క్రియాశీలకం కావాలి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు క్రియాశీలకం కావాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. ఆదివారం ఆయన బి.కొత్తకోటలో పర్యటించారు. ఈ సందర్భంగా బీరంగిరోడ్డులో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ అధికారంలో లేకపోయిన ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్నామని గుర్తు చేశారు. వ్యక్తిగత, సామూహిక సమస్యలను పరిష్కరించామని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, కంచి బలరాం, కోదండ, బసిరెడ్డి, మహేష్ నక్కా, ఎస్ఎస్ ఫయాజ్, సమీవుల్లా, అయూబ్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్ వద్ద కూలిన చింతచెట్టు



సబ్ కలెక్టరేట్ ఆవరణలో కూలిన చింతచెట్టు



గాయపడ్డ వృద్ధుడు చంద్రశేఖర్ ఆచారి

- వృద్ధుడికి గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్

మదనపల్లె : వర్షాలకు సబ్ కలెక్టరేట్ ఆవరణలోని చింతచెట్టు కుప్పకూలింది. కార్యాలయ ప్రహరీగోడకు ఆనుకుని చెట్టు ఉండటంతో గోడతో పాటు సబ్ కలెక్టరేట్ బోర్డు దెబ్బతిన్నాయి. సబ్ కలెక్టరేట్ ఆవరణలోని చింతచెట్టు ఉన్న ప్రాంతంలో భూమి ఎక్కువగా తడిసి, ఒకవైపుగా వాలిపోవడంతో ఆదివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో కూలిపోయింది. అదే సమయంలో పట్టణంలోని లచ్చారెడ్డి వీధికి చెందిన చంద్రశేఖర్ ఆచారి (78) సైకిల్‌పై వెళ్తుండగా కొమ్మలు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన వృద్ధుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లాలని సూచించడంతో బంధువులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చింతచెట్టు కూలడంతో మదనపల్లె–చిత్తూరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, పోలీసులు, ఫైర్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు చెట్టును తొలగించారు.

హెచ్ఎన్ఎస్ఎస్ మోరీ వద్ద గొయ్యి

బి.కొత్తకోట: బి.కొత్తకోట శివారులో బీరంగి రోడ్డుపై హంద్రీ–నీవా పుంగనూరు ఉపకాలువపై నిర్మించిన మోరీ వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. బీరంగి వైపు నుంచి బి.కొత్తకోటకు వచ్చేటప్పుడు ఎడమవైపు మోరీ వద్ద ఈ గొయ్యి ప్రమాదకరంగా మారింది. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉంది. దీనికితోడు గొయ్యి ఇంకా పెద్దదయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇది జరిగితే మోరీ కుంగిపోయే అవకాశం ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతుంది. ఆదివారం ఈ విషయాన్ని గమనించిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు, పోలీసులు గొయ్యి వైపు వాహనాలు రాకుండా ఎర్రబట్టను కట్టారు. తక్షణమే ప్రాజెక్టు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



మోరీ వద్ద ఏర్పడిన గొయ్యి

కురవంక ఆక్రమణలపై కదిలిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

మదనపల్లె : కుంచించుకుపోయిన కురవంక శీర్షికతో ఈ నెల 9వ తేదీన సాక్షిలో ప్రచురితమైన వార్త అధికార యంత్రాంగాన్ని కదిలించింది. జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి ఆదేశాలతో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ అధికారులు కురవంకలో సమగ్రంగా సర్వే నిర్వహించారు. కురవంక ప్రవహించే పాన్నేటిపాళెం పంచాయతీ పరిధిలోని సర్వే నెం.484, 485, 486, 487, 488, 489, 490, 491, బీకేపల్లె పరిధిలోని సర్వే నెం.161, 189, 192ఎ, 280లలో మూడురోజుల పాటు సర్వే నిర్వహించారు. నాలుగు ఇళ్లకు పైగా వంకలో నిర్మాణాలు జరిపినట్లు, పదులసంఖ్యలో గృహాలు వంకను ఆక్రమించుకున్నట్లు తేల్చారు. ఏపీ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్–1905 కింద ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసేందుకు వివరాలు సేకరించారు. సర్వేలో ఆక్రమణగా తేలిన వరకు రెడ్‌మార్కింగ్ చేసి, ఆక్రమణదారులను స్వయంగా తొలగించాలని, లేనిపక్షంలో తామే తొలగింపుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే నిర్వహించిన వారిలో ఇరిగేషన్ ఏఈ రాయల్ రాజేంద్రబాబు, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో యశోద, సచివాలయ సర్వేయర్ సురేష్ ఉన్నారు.



కురవంక ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తున్న అధికారులు

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

కేవీపల్లె : మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. కేవీపల్లె ఎస్ఐగా వి. చిన్నరెడ్డెప్ప ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కేవీపల్లె ఎస్ఐగా ఉన్న రమీ ముల్లా మదనపల్లె–2 పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. తాడిపత్రి నియోజకవర్గం పెద్దవడుగూరులో పని చేస్తున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప బదిలీపై కేవీపల్లెకు వచ్చారు.

కూటమి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం



పాపినేని విశ్వనాథరెడ్డి

రాజంపేట టౌన్ : నాలుగు నెలల్లోనే తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామస్థాయి నుంచి ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అస్తవ్యస్తమైన నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి తరుణంలో ప్రజలకు వైఎస్సార్ సీపీ శ్రేణుల అండ ఎంతైనా అవసరమన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని చూడలేక ప్రజల పక్షాన నిలిచి పోరాటాన్ని ప్రారంభించారని, ప్రతి కార్యకర్త పార్టీ అధినేతకు వెన్నంటి నిలిచి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను, అరాచకాలను ప్రజాక్షేత్రంలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం ఇసుక ధర ఆకాశాన్నంటడంతో సామాన్య ప్రజలు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే తక్కువ ధరకే మద్యం ఇస్తానన్న ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు జరుపుతోందని తెలియజేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉద్యమించాలన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి ఇబ్బందులను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలుద్దామని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో పార్టీ కోసం కష్టపడిన వారికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే జగన్ ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

అబ్దుల్ కలాం అవార్డు ప్రదానం



శ్రీనివాసులును అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

బి.కొత్తకోట: స్థానిక భారత్, విద్యార్థి హైస్కూల్ డైరెక్టర్ పూజారి శ్రీనివాసులు ఆదివారం గుంటూరులో ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన వారికి ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అవార్డులను అందజేశారు.

ఉత్పత్తిదారుల సంస్థలో రైతులు చేరాలి

సిద్దవటం : మండలంలోని రైతులు అందరూ రైతుల ఉత్పత్తిదారుల సంస్థ నుంచి సభ్యత్వ తీసుకొని దళారీ వ్యవస్థ నుంచి విముక్తి చెందాలని జనసేన నాయకుడు అతికారి క్రిష్ణ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం రైతుల ఉత్పత్తిదారుల సంస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 2019 సంవత్సరంలో రైతుల దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి పదివేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రారంభించి దళారీ వ్యవస్థ రూపురేఖలను మార్చాలని ఆలోచన చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని వరి, చామంతి, ఉల్లి, అరటి, తోటలు ద్బెతిన్నాయన్నారు. అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన అన్నారు.

జూదరుల అరెస్టు

సంబేపల్లె : మండలంలో 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సంబేపల్లె పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని రౌతుకుంట గ్రామంలో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 8 మంది వ్యక్తులతోపాటు వారి నుంచి రూ.4200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వర్షాలకు వరి పంటలో మొసులు

పెనగలూరు : వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రైతాంగం పూర్తిగా నష్టపోయారు. వరితోపాటు సాగు చేసిన అన్ని పంటలు, ఉద్యాన తోటలపై పెద్ద ప్రభావం చూపిందన్నారు. కాగా మండలంలోని ఎగువ సిద్ధవరంలో రైతు పెంచలయ్యయాదవ్ రెండు ఎకరాల భూమిలో వరి పంట వేశాడు. పంట చేతికందే సమయంలో నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు వరి పంటలో మొసులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొసులొచ్చిన పంటను కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

హక్కుల కోసం రాజీ లేని పోరాటం

వాల్మీకిపురం: వాల్మీకుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేస్తామని వాల్మీకిపురం మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు విష్ణు చైతన్య తెలిపారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో జరిగిన వాల్మీకుల సంఘం సమావేశమైంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా విష్ణు చైతన్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా రంజిత్ కుమార్, రాజగోపాల్, కార్యదర్శిగా భరత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా రమేష్, సభ్యులుగా లక్ష్మిదేవి, రెడ్డి ప్రసాద్, సాంబశివ, భాస్కర్, రామచంద్ర, రాజేష్ కుమార్, రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



వాల్మీకి సంఘం నూతన కార్యవర్గం

హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సందడి

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై కమ్ముకున్న మేఘాలు, ఆపై చిరుజల్లులు, చల్లటి వాతావరణం ఓ వైపు దట్టమైన అడవిలో వర్షానికి సేలయేరులా ప్రవహిస్తున్న చిన్నపాటి జలపాతాల వద్ద పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అటవీప్రాంతంలో నీటి ప్రవాహాలు అలరిస్తున్నాయి. బండల నీళ్లు ప్రవహిస్తూ, పై నుంచి కింద ప్రవహిస్తున్న నీళ్లు జలపాతాల్లా కనిపిస్తున్నాయి. వీటిని తిలకించేందుకు పర్యాటకులు ఘాట్‌రోడ్డు పక్కన అడవిలోకి వెళ్లి ఈ సుందర దృశ్యాలను తిలకిస్తూ సేదతీరుతున్నారు. కొండపైకి పర్యాటకుల రద్దీ పెరిగింది.



హార్సిలీహిల్స్ అడవిలో నీటి పరవళ్లను తిలకిస్తున్న పర్యాటకులు

పోలీస్ అమరుల త్యాగాలు మరవలేనివి

రాయచోటి టౌన్ : పోలీసుల అమరవీరుల త్యాగాలు మరవలేనివని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పోలీస్ అంటేనే సేవ, త్యాగం, గంభీరం, తెగువ వంటి పదాలకు పర్యాయ పదాలన్నారు. దేశంలోని చైనా సరిహద్దు ప్రాంతమైన అక్సాయ్‌చిన్‌లో 1959 అక్టోబర్ 21న సీఆర్‌పీఎఫ్ జవానుల వీరోచితంగా పోరాడి చైనా సైనికుల నుంచి దేశ ఆక్రమణ కాకుండా అడ్డుకున్నారు. అప్పుడు జరిగిన పోరాటంలో పంజాబ్ చెందిన జవానులు మృతి చెందారని వారి స్ఫూర్తి, త్యాగాలకు గుర్తుగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రజలకు ఏ అన్యాయం జరిగినా, ఆపద వచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది పోలీసేనని, పోలీస్ లేని సమాజాన్ని ఊహించలేమని పేర్కొన్నారు.